సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించండి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



అధికారులతో మాట్లాడుతున్న రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అధికారులతో అన్నారు. పట్టణాభివృద్ధిపై మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానితో కలసి అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ సజావుగా సాగాలని, కొళాయిల ద్వారా మంచినీటి సరఫరాకు అవసరమైన చర్యలు వీలైనంత త్వరగా చేపట్టాలని కోరారు. ప్రధాన కూడళ్లు, మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు ప్రతిరోజూ వార్డు పర్యటనలు చేయాలని చెప్పారు. ప్రతి రోజూ నీటి సరఫరా చేసేలా పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్లకు కోటి రూపాయలు అవసరమవుతాయని అధికారులు రాజేష్ నాయుడికి వివరించారు. నిధులు విడదల చేసేందుకు కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ టి.వెంకటరమణ, ఏఈఈ సీహెచ్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు షేక్ ఇస్మాయిల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత వైద్య శిబిరం ప్రారంభం



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు.. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. నరగాయపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష -2వ విడత వైద్య శిబిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. వైద్య సేవలు పొందుతున్న వారిని పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ గతేడాది నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన లభించిందన్నారు. నూతన ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు చెన్నయ్య, డాక్టర్ రజాక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట ప్రకారం పింఛను నగదు పెంపు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పింఛను కానుకను రూ.3వేలకు పెంచారని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పింఛను పెంపు వారోత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ నెల 8వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు పింఛను నగదు అందజేశారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

నరసరావుపేట: పురపాలక పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. నాలుగు సచివాలయాల పరిధిలో పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులకు బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

- **రొంపిచర్ల:** మండలంలోని పలు సచివాలయాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. 40 జట్లు పాల్గొన్నాయి. మండల స్థాయి అధికారులు క్రీడలను పర్యవేక్షించారు.
- **యడ్లపాడు:** మండలంలోని సొలస జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదనంలో కబడ్డీ, వాలీబాల్, లింగారావుపాలెం జెడ్పీ హైస్కూల్లో కబడ్డీ, ఖో-ఖో, కొండవీడు, తుర్లపాడు గ్రామాల్లో క్రికెట్ పోటీలు జరిగాయి. 10 మ్యాచ్‌లు నిర్వహించగా వీటిలో 6 పురుషులు, 4 మహిళా జట్లు పాల్గొన్నాయి. స్పోర్ట్స్ అథారిటీ మండల కో-ఆర్డినేటర్ మాధురిరాణి, మాజీ ఎంపీపీ ఎంవీ బాలచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు.

రేమిడిచర్లలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

బొల్లాపల్లి: రేమిడిచర్ల జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించారు. బొల్లాపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఎం.సాయివినూత్న, ప్రత్యేక వైద్య నిపుణులు కేఎల్ఎన్ రావు, సుధా స్రవంతి, కంటి వైద్యుడు షేక్ చాంద్‌బాషా వైద్య సేవలు అందించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో, డీఎల్ ఏటీవో షేక్ జిలానీ బాషా సందర్శించారు. 322 మందికి వైద్య పరీక్షలు, 64 మందికి కళ్లజోళ్లు అందజేశారు.

వీఆర్వోల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

యడ్లపాడు: రెవెన్యూ ఉద్యోగులు ఒకే కుటుంబంలా ఉంటూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దారు వైవీబీ కుటుంబరావు అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో వీర్వోల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లు, గోడ ప్రతుల్ని ఆయన ఆవిష్కరించారు. సంఘం మండలాధ్యక్షుడు కేఏ చారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డీటీ శ్యామలత, ఆర్ఐ చక్రవర్తి, ఎస్ఏ మోజేస్, వీఆర్వోల సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రేమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

యడ్లపాడు: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ)క్యాలెండర్, స్టిక్కర్లను ఎంఈవో ఎంవీ నాగరత్నం మంగళవారం ఆవిష్కరించారు. యడ్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం విజయభారతి, ఎస్టీయూ మండల అధ్యక్షుడు గుప్తా, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, శివపార్వతి, ఎల్ఎఫ్ఎంఎల్ హెచ్ఎం మోజేస్ ఉన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, 36 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఎస్ఐ సురేంద్రబాబు మంగళవారం తెలిపారు. నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలో దాడులు నిర్వహించి, అక్రమంగా మద్యం కలిగి ఉన్న కంచెర్ల పెద కాశయ్యను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యడ్లపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. యడ్లపాడు దిగువ ఎస్సీ కాలనీకు చెందిన శామ్యూల్(50) పిల్లికొండ సమీపంలో జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో గుంటూరు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి, ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రగాయాలతో శామ్యూల్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతనిపై నుంచి రెండు వాహనాలు దూసుకెళ్లడంతో.. ముఖం గుర్తించలేని విధంగా ఛిద్రమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

నేడు బరంపేటలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

నరసరావుపేట: బరంపేట పీహెచ్‌సీ పరిధిలోని సీబీ కాలనీ సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

7న ప్రతిభ పరీక్ష

శావల్యాపుర: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 7న ప్రతిభ పరీక్ష శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు సుచరిత ఏడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ కేవీ ఆర్ మోహన్ చందు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగినేని ఫౌండేషన్, సుచరిత ఏడ్యుకేషనల్ సొసైటీ సంయుక్తంగా పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా డీటీకి బాధ్యతలు

శావల్యాపురం: మండల ఇన్‌చార్జి తహసీల్దారుగా డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దారు షేక్ జాన్ సైదులు ఇటీవల స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు.

నేడు రూ.9కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు



శావల్యాపురం: వేల్చూరు గ్రామంలో రూ.9 కోట్ల వ్యయంతో నిర్మించిన కోల్డ్ స్టోరేజ్, వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నట్లు శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య మంగళవారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, విడదల రజని, అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, అప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి పాల్గొంటారని తెలిపారు. భారీ అన్నదానం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఎంపీపీ ఎం.సుహాసిని, సొసైటీ డైరెక్టర్ ఓంగోలు ఆంజనేయులు, సీఈఓ జాలాది నాగప్రసాదు, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులకు సన్మానం

వినుకొండ(నూజెండ్ల): నరసరావుపేట డివిజన్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులుగా నియమితులైన పత్రా జార్జి, మోషేలను నియోజకవర్గ పాస్టర్లు ఘనంగా సన్మానించారు. జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు జి. స్వెనోమ్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. స్వెనోమ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సక్కా నాగిరెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలన్నారు. పాస్టర్లు అమృతపూడి జాన్ హైడ్రాజ్, కొత్త రవికిరణ్, రెడ్డిబోయిన గాంధీ, రాజేంద్ర ప్రసాద్, దేవప్రసాద్, రామయ్య, బండి సీమోను, ఇస్సాక్, సుందరరావు, పీటర్, ప్రేమ్‌కుమార్, రూబెన్‌రాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

5న గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

నాదెండ్ల: గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని ప్రతి నెల 5న ఇంటికే పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్‌లను ఎంపీడీఓ షేక్ జాకీర్ హుస్సేన్ ఆదేశించారు. తన కార్యాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో ఉన్నందున, సచివాలయ సిబ్బందిని వారి పరిధిలోని అంగన్‌వాడీల నిర్వహణకు ఇన్‌చార్జిలుగా నియమించినట్లు చెప్పారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందించాలని స్పష్టం చేశారు. సీడీపీఓ శాంతకుమారి, ఎంఈఓ ఆంజనేయులు, సూపర్‌వైజర్లు పార్వతీ, పద్మావతి, ఉషారాణి, నిర్మలా కృష్ణమాల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలి

శావల్యాపురం: సచివాలయ ఉద్యోగులు అంగన్‌వాడీ కేంద్రాలు రోజూ తీసి ఉంచాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ, ఆడుదాం ఆంధ్రా, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 5న గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఏపీఎం జి.వాసుబాబు. ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రాధాకృష్ణన్, పీఈటీ కె.రాజేష్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీవో క్యాలెండర్ ఆవిష్కరణ

ఈపూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఈపూరు శాఖ అధ్యక్షుడు ఎస్. రామారావు ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఎంపీడీవో కార్యాలయ ఏఓ సీహెచ్‌వీ రవి, సీనియర్ సహాయకులు పల్లా రవికుమార్, వీఆర్వో షేక్ నబి పాల్గొన్నారు.